

బస్తీ దవాఖానాలతో మెరుగైన వైద్యం
బస్తీ దవాఖానాలతో మరింత మెరుగైన వైద్యం అందనుందని ఎమ్మెల్యే ఫైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు.
- 9లో



సాంకేతిక పరిజ్ఞానం జోడించాలి
పరిశోధనలకు సాంకేతిక పరిజ్ఞానం జోడించుకోవాలని ఎంజీయూ వీసీ గోపాల్‌రెడ్డి సూచించారు.
- 10లో

గరిష్టం/కనిష్టం 36°/19°

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉంటుంది. రాత్రిపూట చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

యాదాద్రి శివాలయంలో విశేష పూజలు



రుద్ర హవనం నిర్వహిస్తున్న పూజారులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామికి అనుబంధంగా ఉన్న శ్రీ పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం విశేషపూజలు నిర్వహించారు. శ్రీస్వామి వారికి రుద్ర హవనం, అభిషేకం, అర్చనలు చేశారు. అనంతరం శివ గర్భాలయంలో, ముఖ మండపంలోని స్పటిక లింగానికి పూజలు నిర్వహించి హారతినిచ్చారు. అదే విధంగా యాదాద్రీశుడికి నిత్య కైంకర్యాలు చేపట్టారు. వేకువజామున సుప్రభాతం, అర్చన, అభిషేకాలు చేశారు. అనంతరం శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, జోడు సేవలు తదితర పూజలు నిర్వహించారు.

ఆస్పత్రిని సందర్శించిన కాయకల్ప బృందం



ఆస్పత్రి పరిసరాలను పరిశీలిస్తున్న అధికారులు

రామన్నపేట : రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రిని డాక్టర్ శ్రవణ్, డాక్టర్ రాజ్యలక్ష్మి నేతృత్వంలోని రాష్ట్రస్థాయి కాయకల్ప అధికారుల బృందం సోమవారం సందర్శించింది. ఈ సందర్భంగా వారు ఆస్పత్రిలోని రికార్డులను పరిశీలించారు. వైద్య సేవలపై ఆరా తీశారు. వివిధ విభాగాల పనితీరును తెలుసుకున్నారు. వార్డుల్లోకి వెళ్లి రోగులతో మాట్లాడారు. ఆస్పత్రి పరిసరాల్లో కలియదిరిగి పరిశీలించారు. రికార్డులను చూశారు. వైద్యులు, సిబ్బంది పనితీరు, పారిశుద్ధ్య నిర్వహణపై సంతృప్తిని వ్యక్తం చేశారు. వారివెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.వీరన్న ఉన్నారు.

యువ వైద్యుల పాత్ర కీలకం



మాట్లాడుతున్న డాక్టర్ అభిషేక్ బ్రహ్మచారి

బీబీనగర్ : దేశ నిర్మాణంలో, ప్రజలకు వైద్య సేవలు అందించడంలో యువ డాక్టర్ల పాత్ర కీలకమని డాక్టర్ స్వామి అభిషేక్ బ్రహ్మచారి అన్నారు. 'జాతి నిర్మాణంలో యువత పాత్ర' అనే అంశంపై ఎయిమ్స్ వైద్య కళాశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. యువ డాక్టర్లు అన్ని వర్గాల ప్రజలకు వైద్య సేవలు అందించాలని, దేశాభివృద్ధిలో తమవంతు పాత్ర పోషించాలని సూచించారు. అనంతరం దేశంలోని పౌరాణిక, చారిత్రక ఘట్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ భాటియా, డీన్ రాహుల్‌నారంగ్, వైద్యులు పాల్గొన్నారు.

ఇసుక మాఫియాను అరికట్టాలి



మాట్లాడుతున్న గోద శ్రీరాములు

భువనగిరిటౌన్ : జిల్లాలో విచ్చలవిడిగా సాగుతున్న ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు డిమాండ్ చేశారు. సోమవారం భువనగిరిలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన తెలంగాణ రైతు సంఘం జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయకపోతే భవిష్యత్‌లో భూగర్భ జలాలు అడుగంటి రైతులు ఇబ్బందులకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. అలాగే రైతు రుణాలను ఏకకాలంలో మాఫీ చేయాలని, నాసిరకం విత్తనాలను అరికట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. గ్రామాల్లో కమిటీలు వేసి రైతు సంఘాన్ని బలోపేతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు పైళ్ల యాదిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కొల్లూరి రాజయ్య, నాయకులు ఏశాల అశోక్, చెక్క వెంకటేష్, అరుట్ల సుశీల, ఉప్పుల కొమరయ్య, జక్క దయాకర్ రెడ్డి, తెడ్డు అంజనేయులు, దొండ ఎల్లయ్య, రవీందర్ పాల్గొన్నారు.

బీళ్లు తడిసేలా..!



ఆత్మకూర్(ఎం) మండల పరిధిలో కొనసాగుతున్న ఓటీ- 5 కాల్వ పనులు

గోదావరి జలాల తరలింపునకు చర్యలు వేగిరం

- యర్రంబల్లి, గండిచెరువు నుంచి ప్రత్యేకంగా కాల్వల నిర్మాణం
- ముమ్మరంగా సాగుతున్న ఓటీ–5 పనులు
- ఓటీ–2 నిర్మాణానికి కొనసాగుతున్న సర్వే
- ఏడు మండలాలకు ప్రయోజనం

ఆత్మకూరు(ఎం) : నీళ్ల లేక నోళ్లు తెరిచిన బీడు భూములను తడపడానికి గోదారమ్మ కాలు మోపనుంది. జిల్లాలోని యాదగిరిగుట్ట, ఆత్మకూరు(ఎం) మోటకొండూరు, మోత్కూరు, అడ్డగూడూరు, బీబీనగర్, వలిగొండ మండలాల పరిధిలోని బునాదిగాని కాల్వ ద్వారా కాళేశ్వరం జలాలు అందించేందుకు చేపట్టిన పనులను వేగిరం చేశారు.

నెరవేరని లక్ష్యం

మోత్కూరు, మోటకొండూరు, ఆత్మకూరు(ఎం), అడ్డగూడూరు మండలాలకు సాగునీరు అందించడానికి 2006లో బునాదిగాని కాల్వ పనులకు శంకుస్థాపన చేశారు. ఇప్పటి వరకు పూర్తి కాకపోవడంతో కాల్వ ద్వారా రైతులకు మూసీ జలాలు అందించాలన్న లక్ష్యం నెరవేరలేదు. దీంతో ప్రభుత్వ విప్ సునీత సొంత నిధులతో పనులు చేయిస్తున్నారు.

ఓటీ–2 కాల్వ కోసం సర్వే

యాదగిరిగుట్ట మండలానికి ఓటీ–2 కాల్వ ద్వారా గోదావరి నీరు అందించడానికి అధికారుల మ్యాప్ రూపొందించారు. ప్రస్తుతం సర్వే కొనసాగుతుతోంది. ఓటీ – 2 కాల్వ గండిచెరువు నుంచి జంగంపల్లి, దాతరుపల్లి, మైలార్‌గడ్డ, సైదాపురం వరకు వస్తుంది. రామాజీపేట వద్ద రహదారిని కటింగ్ చేయాల్సి ఉంది. అక్కడి నుంచి మోటకొండూరు మండలం దుర్సగానిపల్లి, చందెపల్లి, చామాపురం, ఆత్మకూరు (ఎం) మండలం సింగారం, రేగులకుంట, కొరటికల్, పోతిరెడ్డిపల్లి, పల్లెపహాడ్, ఉప్పలపహాడ్, పారుపల్లి, మోదుభావిగూడెం వరకు గోదావరి జలాలు అందేలా మ్యాప్ రూపొందించారు.

1.20 లక్షల ఎకరాలకు నీరు

ఓటీ – 5, ఓటీ–2 కాల్వల ద్వారా 1.20 లక్ష ఎకరాలకు సాగునీరు అందనుంది.

మూసీకి బదులుగా గోదావరి ..

ఆత్మకూరు(ఎం) మండలంలోని సర్వేపల్లి, రాయిపల్లి, ఆత్మకూరు(ఎం), తిమ్మాపురం, సిద్దాపురం, పుల్లాయిగూడెం, రహీంఖాన్‌పేట, కప్రాయపల్లి, మోటకొండూరు మండలంలోని నాంచారిపేట, కొండాపురం గ్రామాలకు మూసీ జలాలకు బదులుగా కాళేశ్వరం ద్వారా గోదావరి జలాలు అందజేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం రాయగిరి వద్ద కలెక్టరేట్ వెనుక వైపు నిర్మాణం చేస్తున్న బస్వాపురం రిజర్వాయర్ ప్రధాన కాల్వ ద్వారా గోదావరి జలాలు తరలించాలని నిర్ణయించారు. యర్రంబల్లి వద్ద ఓటీ–5 పేరుతో కాల్వ తవ్వుతున్నారు. దీన్ని భువనగిరి మండలం వీరవల్లి వద్ద బునాదిగాని కాల్వకు అనుసంధానం చేయనున్నారు.



బునాదిగాని కాల్వ

ఓటీ-5 ద్వారా సాగునీరు



ఆత్మకూరు(ఎం)మండలంలో కొన్ని గ్రామాలకు ఓటీ – 5 కాల్వ ద్వారా గోదావరి జలాలు అందించడానికి ఏర్పాట్లు చేస్తుండడం చాలా సంతోషం. ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి తన సొంత నిధులతో కాల్వ పూర్తి చేయిస్తున్నారు. ఓటీ–2 ద్వారా యాదగిరిగుట్ట నుంచి పారుపల్లి వరకు నీరు అందించాలి.

– యాస ఇంద్రారెడ్డి, రైతు, ఆత్మకూరు(ఎం)

ఓటీ-2 కాల్వ సర్వే నడుస్తుంది



ఓటీ -5 కాల్వ పనులు ముమ్మరంగా నడుస్తున్నాయి. ప్రస్తుతం తుక్కాపురం వరకు పనులు పూర్తయ్యాయి. ఓటీ–2 కాల్వ కోసం కూడా మ్యాప్ రూపొందించి ప్రభుత్వ అనుమతి కోసం పంపించాం. కాల్వ నిర్మాణం కోసం యాదగిరిగుట్ట నుంచి పారుపల్లి వరకు సర్వే చేస్తున్నాం. త్వరలోనే పూర్తవుతుంది.

– సునీల్ ప్రసాద్, నీటిపారుదల శాఖ డీఈ

1.20 లక్షల ఎకరాలకు సాగు నీరు



బునాదిగాని కాల్వను సొంత నిధులతో పూర్తి చేయిస్తున్నా. ఓటీ–5 కాల్వను భువనగిరి మండలం వీరవెల్లి వద్ద బునాదిగాని కాల్వకు అటాచ్ చేస్తారు. దీంతో మోటకొండూరు, ఆత్మకూరు(ఎం)మండలాల్లో కొన్ని గ్రామాలకు గోదావరి జలాలు అందుతాయి. మిగతా గ్రామాలను కవర్ చేయడానికి ఓటీ–2 కాల్వ నిర్మిస్తున్నాం. ప్రస్తుతం సర్వే పనులు నడుస్తున్నాయి. ప్రణాళికలు, మ్యాప్ రూపొందించి ప్రభుత్వ అనుమతి కోసం పంపించాం.

–గొంగిడి సునీత, ప్రభుత్వ విప్



భువనగిరిలో కేక్ కట్ చేస్తున్న డ్యాన్స్ అకాడమీ నిర్వాహకులు, చిన్నారులు

నాటు నాటు జోష్

- ఆర్‌ఆర్‌ఆర్ సినిమా పాటకు ఆస్కార్ అవార్డు
- అభిమానుల సంబరాలు
- సోషల్ మీడియాలో శుభాకాంక్షలు

సాక్షి, యాదాద్రి : జిల్లాలో సోమవారం ఏ నోట విన్నా ఆర్‌ఆర్‌ఆర్ (రౌద్రం, రణం, రుధిరం) చిత్రంలోని నాటు నాటు పాట వినిపించింది. యువత డీజేలు ఏర్పాటు చేసుకొని స్టెప్పులేయడం కనిపించింది. బెస్ట్ ఒరిజినల్ సాంగ్ కేటగిరీలో నాటు నాటు సాంగ్ ప్రతిష్టాత్మక ఆస్కార్ అవార్డు సొంత చేసుకోవడంతో సంబరాలు అంబరాన్నంటాయి. జూనియర్ ఎన్టీఆర్, రామ్‌చరణ్ అభిమానులతో పాటు సాహితీప్రియులు కేకులు కట్ చేసి కేరింతలు కొట్టారు. చిత్రం యూనిట్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఫ్లెక్సీలు వెలిశాయి. సోషల్ మీడియాలోనూ శుభాకాంక్షలు వెల్లువెత్తాయి.

భారతీయ అస్థిత్వాన్ని చాటి చెప్పిన పాట

ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలోని నాటు నాటు పాట దేశ అస్థిత్వాన్ని చాటిచెప్పింది. తాము ఎవరికీ తీసిపోమని, తెలుగువారిగా గర్వపడుతున్నామని అభిమానులు ఆనందపడ్డారు. కీరవాణి సంగీతం, చంద్రబోస్ సాహిత్యం, జూనియర్ ఎన్టీఆర్, రామ్‌చరణ్ డ్యాన్స్ ఇలా.. ఆస్కార్ అవార్డుకు కావాల్సిన అన్ని అర్హతలు ఆకట్టుకున్నాయి. మరోవైపు పాటతో భారతీయ సంస్కృతి, సంప్రదాయాన్ని బ్రిటీష్ కాలపు ఆధిపత్య నేపథ్యాన్ని సవాల్ చేసిందని పలువురు అభిప్రాయపడ్డారు. దీంతోపాటు అవమానానికి గురైన భారతీయులు చేసే నాట్యాన్ని ఇద్దరు యువ టాప్ హీరోలు చేసిన తీరుకు అభినందనలు వెల్లువెత్తాయి.

ప్రేరణగా నిలుస్తుంది



నాటు నాటు పాట కొరియోగ్రాఫర్ ప్రేమ్ రక్షిత్ మాస్టారుకు ప్రత్యేక ధన్యవాదాలు. ఆస్కార్ అవార్డుతో డ్యాన్స్‌కు మరింత ఆదరణ పెరుగుతుంది. ఎందరో నూతన డ్యాన్సర్లకు నాటునాటు పాట ప్రేరణగా నిలుస్తుంది. ఆర్‌ఆర్‌ఆర్ టీం సభ్యులందరికీ హాట్సాప్.

– సమిలే భరత్‌కుమార్, రాకింగ్ డ్యాన్స్ ఇనిస్టిట్యూట్ కొరియోగ్రాఫర్, భువనగిరి

గొప్ప విషయం



తెలుగు పాటకు ఆస్కార్ అవార్డు రావడం గొప్ప విషయం. జూనియర్ ఎన్టీఆర్, రామ్‌చరణ్‌లు అద్భుతంగా డ్యాన్స్ చేశారు. నాటు నాటు పాట భారతీయులంతా గర్వ పడేలా చేసింది. తెలుగు సినిమాలకు మరిన్ని ఆస్కార్ అవార్డులు రావాలని కోరుకుంటున్నాను.

– సూధగాని కృష్ణగౌడ్, ఎన్టీఆర్ అభిమాని, యాదగిరిగుట్ట

తెలుగువారికి గర్వకారణం



ఆర్‌ఆర్‌ఆర్ చిత్రంలో నాటు నాటు పాటకు ఆస్కార్ అవార్డు దక్కడం ఎంతో గొప్ప విషయం. చాలా ఆనందంగా ఉంది. తెలుగు సినిమా పాట ఆస్కార్ అవార్డు సాధించడం యావత్ తెలుగువారికే గర్వకారణం. తెలుగువారు కూడా దేనికీ తీసిపోరని చెప్పడానికి ఆస్కార్ అవార్డే నిదర్శనం. సినిమా యూనిట్‌కు నా శుభాకాంక్షలు.

– దేప శ్యాంసుందర్, జూనియర్ ఎన్టీఆర్ అభిమాని, దండుమల్కాపురం

తెలంగాణలో బీజేపీకి స్థానం లేదు

- వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్యే పోటీ
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి



ఎమ్మెల్సీ కవిత పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న రామకృష్ణారెడ్డి తదితరులు

సాక్షి, యాదాద్రి : తెలంగాణలో బీజేపీకి స్థానం లేదని, రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్యనే పోటీ ఉంటుందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం భువనగిరిలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్ష నాయకులను భయభ్రాంతులకు గురి చేసి పార్టీలో చేర్చుకోవాలని బీజేపీ యత్నిస్తుందన్నారు. బీజేపీలో చేరనందుకే ఎమ్మెల్సీ కవితపై ఈడీతో కేసులు నమోదు చేయించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. కవితపై బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను సభ్యసమాజం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. మహిళా గవర్నర్ ఉండి మహిళపై చేసిన వ్యాఖ్యలను ఖండించకపోవడం మహిళా లోకాన్ని కించపరచడమేనన్నారు.

ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో సమ్మేళనాలు

అక్టోబర్, నవంబర్‌లో జరగబోయే ఎన్నికల దృష్ట్యా పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడానికి ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించాలని సీఎం కేసీఆర్ ఆదేశించినట్లు రామకృష్ణారెడ్డి తెలిపారు. అందులో భాగంగా జిల్లాలో మార్చి, ఏప్రిల్ మాసాల్లో స్థానిక ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ కార్యకర్తలను అప్రమత్తం చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్సీ కవిత పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. విలేకర్ల సమావేశంలో టీఆర్‌ఎస్ కేవీ ప్రతినిధులు మామిడాల భానుచందర్, శేఖర్, సుంచునాగరాజు, దారాసింగ్ నాయక్, బింగి గణేష్, దాసరి మల్లారెడ్డి, భరత్, భగత్‌సింగ్, అహ్మద్ పాల్గొన్నారు.

ప్రజావాణికి 26 అర్జీలు

- అత్యధికంగా రెవెన్యూ సమస్యలే
- వినతులను స్వీకరించిన కలెక్టర్, అదనపు కలెక్టర్లు



అర్జీదారుల సమస్యలు వింటున్న కలెక్టర్

భువనగిరిటౌన్ : కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి వచ్చి ప్రజలు తమ సమస్యలపై అర్జీలను అందజేశారు. కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, శ్రీనివాస్‌రెడ్డి అర్జీలను స్వీకరించారు. వాటిని పరిశీలించిన అనంతరం సంబంధిత శాఖలకు పంపారు. ప్రజావాణిలో వచ్చిన అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. మొత్తం 26 అర్జీలు రాగా వాటిలో అత్యధికంగా రెవెన్యూ సమస్యలపై 16 అర్జీలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ నాగేశ్వరాచారి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇప్పించండి మేడమ్

తమకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇప్పించాలని ఇద్దరు చిన్నారులు కలెక్టర్‌ను కలిసి విన్నవించారు. భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని రాయగిరికి చెందిన ఉరెల్లి రుతిక, గణేష్ తల్లిదండ్రులు ఏడాది క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించారు. హైదరాబాద్ – వరంగల్ జాతీయ రహదారిపై డివైడర్ మధ్య మొక్కలు నాటడానికి వెళ్తూ వాహనం ఢీకొట్టడంతో మృతి చెందారు. అప్పటి నుంచి ఆ ఇద్దరు చిన్నారులు తమ తాత వద్ద ఉంటున్నారు. రుతిక 5, గణేష్ 3వ తరగతి హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్నారు. మున్సిపాలిటీ పరిధిలో డబుల్ బెడ్ రూం ఇళ్లు పంపిణీ చేస్తుండడంతో ఇద్దరు చిన్నారులు వచ్చి కలెక్టర్‌ను కలిశారు. అనాథలమైన తమకు ఇళ్లు ఇవ్వాలని కోరారు. ఇందుకు కలెక్టర్ స్పందిస్తూ మీ ఇద్దరి బాధ్యత తనదేనని, ఇల్లు కోసం కలెక్టరేట్‌కు రావాల్సిన పని లేదని, ఆ విషయం బాలల సంరక్షణ అధికారి సైదులు చూసుకుంటారని వారితో చెప్పారు. నాతో ఎప్పుడు మాట్లాడాలనుకుంటే అప్పుడు మాట్లాడవచ్చని, అన్ని విధాలా అండగా ఉంటానని చిన్నారులకు భరోసా ఇచ్చారు. ఎక్స్‌గ్రేషియా కూడా వస్తుందని, ఇందుకోసం స్థానిక ఎమ్మెల్యే కూడా ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని వారికి ధైర్యం చెప్పారు.



కలెక్టర్‌కు విన్నవిస్తున్న చిన్నారులు రుతిక, గణేష్

ఇంటర్ పరీక్షలకు సిద్ధం

- రేపటి నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు పరీక్షలు
- జిల్లా వ్యాప్తంగా 31 కేంద్రాలు
- హాజరుకానున్న 13,309 మంది విద్యార్థులు
- నిమిషం ఆలస్యమైనా అనుమతి నిరాకరణ

భువనగిరి : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షల నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా 31 కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 13,309 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉండనుంది.

పరీక్ష కేంద్రాలు ఇలా..

జిల్లా వ్యాప్తంగా 69 జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో 11 ప్రభుత్వ, 29 వివిధ రకాల రెసిడెన్సియల్, 29 ప్రైవేట్ కాలేజీలు ఉన్నాయి. మొత్తం 31 కేంద్రాలను సిద్ధం చేశారు. ఇందులో ప్రభుత్వ 11, మోడల్ 5, టీఎస్‌ఆర్‌డబ్ల్యూఎస్‌లో 5, ప్రైవేట్ కళాశాలల్లో 9 కేంద్రాలు ఏర్పాటు చేశారు. మోత్కూర్ సెంటర్‌లో ఏ, బీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. యాదగిరిగుట్ట, సర్వేల్, రాజాపేటలో సెల్ఫ్ సెంటర్లు ఉన్నాయి.

విద్యార్థుల వివరాలు

పరీక్షలకు 13,309 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. మొదటి సంవత్సరం 6,206 మందికి గాను జనరల్ 4,684, ఒకేషనల్ 1,522 మంది ఉన్నారు. సెకండియర్ 7,103 మంది విద్యార్థులకు జనరల్ విభాగం 5,569, ఒకేషనల్ 1,534 మంది పరీక్ష రాయనున్నారు. పరీక్షల పర్యవేక్షణకు 31 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 31 డీఓలను నియమించారు. వీరితో పాటు 3 కస్టోడియన్లు, ఒక ఫ్లయింగ్ స్క్వాడ్, రెండు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు.

నిమిషం నిబంధన

పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగనున్నాయి. నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించరు. విద్యార్థులు నిర్ణీత సమయానికి కంటే ముందే కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. పరీక్ష కేంద్రంలోకి ఎలాంటి సెల్‌ఫోన్‌లు, వాచ్‌లు తదితర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు.

144 సెక్షన్ అమలు

పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించేందుకు కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు. పరీక్ష జరిగే సమయంలో జిరాక్స్ సెంటర్లను మూసివేయనున్నారు. వీటితో పాటు పరీక్ష కేంద్రాల్లో విద్యుత్, నీటి సౌకర్యం, వెలుతురు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. మెడికల్ సిబ్బందిని అందుబాటులో ఉంచనున్నారు. పరీక్షల సమయానికి ఆర్టీసీ బస్సులను నడపనున్నారు.

పరీక్ష కేంద్రాలకు గంట ముందుగానే చేరుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, హాజరైన అధికారులు

సాక్షి,యాదాద్రి : విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. సోమవాసం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో సమావేశమై ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల ఏర్పాట్లపై సమీక్షించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని సూచించారు. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయకుండా హాల్‌టికెట్‌లు జారీ చేయాలని ఆదేశించారు. అదే విధంగా 9121147135, 08685 – 293312 నంబర్లతో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, ఏదైనా ఇబ్బంది తలెత్తితే సమాచారం అందజేయవచ్చన్నారు. విద్యార్థులు ఒత్తిడికి లోనవకుండా ప్రశాంతంగా పరీక్ష రాయాలని కోరారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అదే విధంగా హైదరాబాద్ నుంచి విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పరీక్షల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొని పరీక్షల ఏర్పాట్లపై మంత్రికి వివరించారు.

ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు



ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా పకడ్బందీ ఏర్పాట్లు చేశాం. విద్యార్థులు ఉదయం 8 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. 8.30నుంచి కేంద్రాల్లోకి అనుమతిస్తాం నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించం. విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాం.

– రమణి, డీఐఈఓ



చౌటుప్పల్ పట్టణంలో సోమవారం జరిగిన సీపీఎం జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, వేదికపై కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్, పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు